

ఆర్టీసీకి గి'రాఖీ'

టీఎస్ ఆర్టీసీకి రాఖీ పౌర్ణమి కలిసొచ్చింది. ప్రయాణికుల రద్దీ పెరిగి బస్సులు కిటకిటలాడాయి. 8లో▸



పకడ్బందీ ఏర్పాట్లు

పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. 8లో▸



గుంతల రోడ్డుపై నిరసన

వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేయాలని తక్కళ్లపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

ఎన్ఐఎంయూ, ఎఫ్‌సీడీఏ ఏర్పాటుకు స్థల పరిశీలన



మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలోని భూములను పరిశీలిస్తున్న అధికారులు

కందుకూరు: ఫ్యూచర్‌సిటీ భూముల్లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్(ఎన్ఐఎంయూ), ఎఫ్‌సీడీఏ (ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయాల ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేశారు. ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్, అర్బన్ ఎఫైర్స్ (ఎంఓహెచ్‌యూఏ) కార్యదర్శి కె.శ్రీనివాస్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తదితరులు సోమవారం మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలోని సర్వే నంబర్ 112 లోని భూమిని పరిశీలించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ కోసం గతంలో కేటాయించిన 20 ఎకరాలు, ఎఫ్‌సీడీఏ కార్యాలయం కోసం అదే సర్వే నంబర్‌లో 7.20 ఎకరాలను క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన చేశారు. వారి వెంట ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ పటిష్టానికి కృషి

రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ డాక్టర్ చారకొండ వెంకటేశ్



విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకటేశ్

మాడ్గుల: విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ చారకొండ వెంకటేశ్ అన్నారు. సోమవారం ఆయన మాడ్గుల జెడ్పీహెచ్ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఫౌండేషన్ స్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసి సర్కార్ బడులను బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. దూర ప్రాంత విద్యార్థులకు స్కూల్ బస్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో 317 జీఓ రద్దు చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని.. విద్యార్థుల భవిష్యత్ కోసం మరో గంట సమయం వెచ్చించాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సర్దార్ నాయక్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యో అవంతిక

- పంచాయతీ ట్రాక్టర్ ఢీకొని మూడేళ్ల చిన్నారి మృతి
- మద్యం మత్తులో వాహనం నడిపిన డ్రైవర్
- పోలీసుల ఎదుట లొంగుబాటు



అవంతిక(ఫైల్)

యాచారం: రోడ్డుపై ఆడుకుంటున్న చిన్నారిని పంచాయతీ ట్రాక్టర్ పొట్టన పెట్టుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోనలి నక్కర్తమేడిపల్లికి చెందిన వన్నాడపు బీరప్ప, మానస దంపతుల కూతురు అవంతిక(3) సోమవారం సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటోంది. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ నడిపే జంగయ్య మద్యం మత్తులో చిన్నారిని బలంగా ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన పాపను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. చిన్నారిని ఢీకొట్టిన డ్రైవర్ నేరుగా వెళ్లి పోలీసులకు లొంగిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ తెలిపారు.

నిమ్స్‌లో సుందరీకరణ పనులు షురూ..

లక్డీకాపూల్ : నిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో సుందరీకరణ పనులకు హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టింది. ఆస్పత్రి ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు ఈ నెల 8న ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దోనెపూడి చక్రపాణి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణీత్ కౌర్‌తో కలిసి డైరెక్టర్ బీరప్ప భూమి పూజ చేసిన సంగతి తెలిసిందే. ఇందుకు హెచ్ఎండీఏ రూ.4 కోట్ల నిధులు కేటాయించింది. ఆ మేరకు సోమవారం ఆస్పత్రి ప్రాంగణాన్ని అహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. తొలుత క్లీనింగ్ పనులకు సమాయత్తమయ్యారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణమంతా పచ్చదనంతో కనువిందు చేసేలా గార్డెనింగ్ పనులు చేపడతారు.

బాల్యానికి మూడుముళ్లు

అధికారులు అడ్డుకుంటున్నా ఆగని బాల్యవివాహాలు

'నందిగామ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలిక(13)కు మానసిక వైకల్యంతో బాధపడుతున్న కందవాడకు చెందిన ఓ వ్యక్తి(36)తో మే 28న నందిగామ శివారులోని ఓ ఆలయంలో వివాహమైంది. నిజానికి ఈ పెళ్లి ఆమెకు ఏమాత్రం ఇష్టం లేదు. ఇదే విషయాన్ని సదరు చిన్నారి పాఠశాల ఉపాధ్యాయులకు తెలియజేయగా, వారు పోలీసు, రెవెన్యూ, స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. పెళ్లి కుమారుడు, మధ్యవర్తి, పురోహితుడు, బాలిక తల్లిపై నందిగామ ఠాణాలో కేసు నమోదు చేసి బాధితురాలిని సఖీ కేంద్రానికి తరలించాల్సి వచ్చింది' అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికీ బాల్య వివాహాలు వెలుగు చూస్తుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

- అత్యవసర నంబర్లను ఆశ్రయిస్తున్న బాలికలు
- 2024లో తొలి మూడు స్థానాల్లో వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: అభివృద్ధిలో అంతర్జాతీయ దేశాలతో పోటీ పడుతున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను అదే స్థాయిలో సామాజిక వెనుకబాటుతనం వెంటాడుతోంది. నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలకు ఆర్థిక అసమానతలు తోడయ్యాయి. ఫలితంగా 18 ఏళ్ల తర్వాత జరగాల్సిన అమ్మాయిల వివాహ తంతు.. 14 ఏళ్లకే ముగుస్తోంది. తాను ఇప్పుడే పెళ్లి చేసుకోబోనని, అందరిలాగే తాను ఉన్నత చదువులు చదువుకుంటానని చెప్పినా.. తల్లిదండ్రులు వినిపించుకోవడం లేదు. బలవంతపు పెళ్లిళ్లకు పాల్పడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో బాలికలు అత్యవసర ఫోన్ నంబర్లను ఆశ్రయిస్తున్నారు. గత ఏడాది నమోదైన బాల్య వివాహాలను పరిశీలిస్తే.. ఇదే విషయం స్పష్టమవుతోంది. గత ఏడాది అత్యధిక బాల్య వివాహాలు వెలుగు చూసిన జిల్లాల జాబితాలో వికారాబాద్(94) ముందు వరుసలో నిలువగా, ఆ తర్వాత స్థానాల్లో రంగారెడ్డి(54), మేడ్చల్ (53) జిల్లాలు ఉండడం గమనార్హం. ఐటీ చదువులకు, అంతర్జాతీయ పెట్టుబడులకు నిల యంగా మారిన ఈ ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం, బాల్య వివాహాలు వెలుగు చూస్తుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

ఆర్థిక అంతరాలే అసలు కారణం

అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డు రాకతో జిల్లా ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. జిల్లాలోని శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, కొండాపూర్, సైబర్‌సిటీ, నానక్‌రాంగూడ, కోకాపేట్, నార్సింగి తదితర ప్రాంతాల్లో ఎకరం భూమి ధర రూ.వంద కోట్లకుపైగా పలుకుతోంది. ఆకాశానికి నిచ్చెన వేస్తున్నట్లు ఓఆర్‌ఆర్‌కు ఇరు పక్కలా హైరైజ్ భవనాలే దర్శనమిస్తున్నాయి. ఐటీ, వాటి అనుబంధ సంస్థలు, రియల్ ఎస్టేట్ పెట్టుబడులు భారీగా వచ్చి చేరడంతో ప్రజల జీవనశైలిలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. తలసరి ఆదాయంలో దేశంలోనే ముందు వరుసలో నిలిచిన జిల్లా కూడా ఇదే. ఇలాంటి కీలకమైన జిల్లాలో ఇప్పటికీ అంతరాలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఉన్నవాడు మరింత ఉన్నవాడిగా, లేనివాళ్లు మరింత లేనివాళ్లుగా మారుతున్నారు. సామాజిక వెనుకబాటుకు ఆర్థిక పరమైన అంశాలు తోడవడంతో కడుపున పుట్టిన పిల్లలను వదిలించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల శంషాబాద్ మండలంలో ఓ తల్లి అప్పుడే పుట్టిన బిడ్డను ఇతరులకు అమ్ముకుని పట్టుబడగా, ఉన్నత చదువులు చదివించి, బిడ్డను మరింత ప్రయోజకురాలిని చేయాల్సిన మరో తల్లి ఏకంగా తన బిడ్డకంటే రెట్టింపు వయసున్న వ్యక్తికి కట్టబెట్టేందుకు సిద్ధపడింది. అంతర్జాతీయ వేదికపై ఓ వెలుగు వెలుగుతున్న ఉమ్మడి జిల్లాలో తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్ని పథకాలు ప్రవేశపెడుతున్నా.. రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి, పైసా ఖర్చు లేకుండానే ఉన్నత చదువులు చెప్పిస్తున్నా.. వివాహం, ఇతర అంశాలకు వచ్చే సరికి తల్లిదండ్రుల ఆలోచన భిన్నంగా ఉంటోంది. అభం శుభం తెలియని వయసులో పెళ్లి చేస్తుండటం ఆందోళనకు గురి చేస్తోంది.



లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి ఇందిరమ్మ ఇంటి రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

'ఇందిరమ్మ' గృహప్రవేశం

- హాజిపల్లిలో తొలి ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే
- లబ్ధిదారు కుటుంబానికి నూతన వస్త్రాలతో సారె

షాద్‌నగర్: ఇందిరమ్మ పథకంలో భాగంగా హాజిపల్లిలో నిర్మించిన ఓ ఇంటిని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సోమవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన ఒంటరి మహిళ స్వరూపకు ప్రభుత్వం ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి విడతల వారీగా లబ్ధిదారుకు డబ్బులు అందడంతో మూడు నెలల్లో పనులు పూర్తి చేయించింది. గృహ ప్రవేశ వేడుకకు వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే హాజిపల్లికి వెళ్లారు. నియోజకవర్గంలో తొలి ఇంటిని పూర్తి చేసిన స్వరూపతో పాటు ఆమె కూతురు, అల్లుడికి నూతన వస్త్రాలు అందించి, సారె పెట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గూడు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు రాగా వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా విడతలవారీగా డబ్బులు జమ చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, కొంకళ్ల చెన్నయ్య, హాజిపల్లి దర్శన్, శ్రీనివాస్, సత్యయ్య తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచుతాం



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

- ఆఫీసులు, విద్యాలయాలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం
- మెరుగైన విద్యుత్ సరఫరా కోసం చర్యలు తీసుకుంటున్నాం
- పేదలందరికీ రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మొయినాబాద్: భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ముర్తూజగూడలో చిలుకూరు, బాకారం, నవాబ్‌పేటకు సంబంధించిన 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లకు ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో భట్టి మాట్లాడుతూ.. సోలార్ ఉత్పత్తిని పెంచడం కోసం అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేలా ఇప్పటికే ఆదేశాలిచ్చామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో పూర్తిగా సోలార్ విద్యుత్‌ను అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ, దేవాదాయ, ఇరిగేషన్ భూముల్లో అనుకూలతను బట్టి సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని స్పష్టంచేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ పంపిణీ వ్యవస్థను సైతం పెంచేందుకు కొత్తగా సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు సన్నబియ్యం అందిస్తున్నామని.. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని వెల్లడించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడం కోసం రాష్ట్రంలో 104 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొయినాబాద్ ప్రాంతంలో పట్టణీకరణ పెరుగుతుండడంతో పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రాంత విద్యుత్ అవసరాల కోసం 132 కేవీ సబ్ స్టేషన్‌ను మంజూరు చేస్తున్నామని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, విద్యుత్ శాఖ సీఎండీ ముషరఫ్అలీ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై అసహనం

సబ్ స్టేషన్ శంకుస్థాపన సందర్భంగా చేసిన ఏర్పాట్లపై ఉప ముఖ్యమంత్రి భట్టి అసహనం వ్యక్తం చేశారు. సభావేదిక వద్ద సరైన వసతులు లేకపోవడంపై కినుక వహించారు. వర్షం కారణంగా టెంట్లు తడిసిపోవడంతో పాటు నేలపై వాన నీరు నిల్వడంతో ఇబ్బంది పడ్డారు. భట్టి మాట్లాడినంత సేపు స్థానిక నాయకులు కురుస్తున్న టెంట్ కిందే నిలబడ్డారు. శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో తమ గ్రామం పేరు లేదని ముర్తూజగూడ వాసులు అధికారులను నిలదీశారు. అధికారిక కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు సభావేదికపై కూర్చుని ప్రొటోకాల్ ఉల్లంఘించారు.



సభా వేదిక ఏర్పాటు చేసిన టెంట్ల కింద చేరిన వర్షం నీరు



విద్యార్థులతో సందడి చేస్తున్న మంచు లక్ష్మీప్రసన్న, రత్నారెడ్డి

స్వచ్ఛంద సేవలు అభినందనీయం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: టీచ్ ఫర్ చేంజ్, వేనీరావు ఫౌండేషన్ సేవలు అభినందనీయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని జన్వాడ జెడ్పీహెచ్ఎస్‌లో టీచ్ ఫర్ చేంజ్, వేనీరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్, విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య, టీచ్ ఫర్ చేంజ్ ఫౌండర్ మంచు లక్ష్మీప్రసన్న, వేనీ రావు ఫౌండేషన్ చైర్‌పర్సన్ రత్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంచు లక్ష్మీప్రసన్న సామాజిక బాధ్యతగా స్వచ్ఛంద సంస్థని స్థాపించి, విద్యార్థులకు సాయం చేయడం గొప్ప విషయమన్నారు. లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. 11 ఏళ్ల క్రితం సంస్థను ఏర్పాటు చేశామని.. భవిష్యత్‌లో మరింత విస్తరింపజేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జన్వాడ పాఠశాలలో ఒక స్మార్ట్ తరగతి గది నిర్మాణానికి త్వరలో భూమి పూజ చేస్తామని.. రానున్న రోజుల్లో మరో మూడు అదనపు తరగతి గదులు నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అక్బర్, శంకర్‌పల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్, నర్సింహ, వెంకట్‌రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

బుగ్గ రామేశ్వర ఆలయ పునఃనిర్మాణానికి కృషి

కంచి పీఠం ఆస్థాన పండితులు నారాయణ చక్రధర శర్మ

షాబాద్: బుగ్గ రామేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని కంచి పీఠం ఆస్థాన పండితులు నారాయణ చక్రధర శర్మ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని కొమరబండ గ్రామంలోని బుగ్గరామేశ్వరాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామేశ్వరాలయం వాస్తు ప్రకారం ఎలా నిర్మిస్తే బాగుంటుందో చెప్పాలని గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని కొలను ఆధునికీకరణ, గ్రామం నుంచి ఆలయం వరకు బీటీ రోడ్డు వేయాలన్నారు. దుకాణ సముదాయాలు తదితర అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాస్, చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, గ్రామస్తులు గోపాల్, తదితరులున్నారు.

14 వరకు 'వాయిస్ ఫర్ బాయిస్'



శిబిరంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కద్తాల: మైసిగండి గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రారంభమైన శారీరక, మానసిక, సామాజిక అవగాహన శిక్షణ శిబిరం విజయవంతంగా కొనసాగుతోంది. జిల్లా గిరిజన సంక్షేమాధికారి రామేశ్వరిదేవి, ఐటీడీఓ వెంకటయ్య ఆదేశాల మేరకు వాయిస్-4 సంస్థ ఆధ్వర్యంలో ఐటీడీఏ సహకారంతో ఈ నెల 5వ తేదీన శిబిరం ప్రా రంభించారు. సోమవారం ప్రోగ్రాం చీఫ్ ఫర్హాన్ మాట్లాడుతూ.. పాఠశాలలోని 7, 8, 9వ తరగతి విద్యార్థులకు శారీరక, మానసిక, సామాజిక అవగాహనను పెంపొందించే అంశాలతో పాటు, నేటి సమాజంలో సమానత్వపు దృక్పథాన్ని కలిగించడానికి 'వాయిస్ ఫర్ బాయిస్'ప్రారంభించామన్నారు. ఈ నెల 14 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. బాలురకు, మహిళలపై గౌరవం, సానుభూతి, ఆత్మనియంత్రణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, సమాజంలో గౌరవంగా జీవించడం, ఇతరులతో మర్యాదపూర్వకంగా మెలగడం, ఉన్నత విద్యను అభ్యసించడం, ఆత్మస్థైర్యం పెంపొందించడం, ధైర్యంగా జీవించడం లాంటి అంశాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పాపయ్య, హెచ్‌డబ్ల్యూఓ బాలరాజు, ఉపాధ్యాయులు నయీముద్దీన్, సంతోశ్‌కుమార్, శ్రీశైలం, సురేశ్, భగవతి, మహేశ్వరి, పీడీ మంజుల, సంస్థ కోఆర్డినేటర్లు ఉన్నారు.

కరెంటోళ్లకు దండాలు



చెరువులో ఉన్న విద్యుత్ స్తంభం వద్దకు వెళ్తున్న శ్రీకాంత్



మరమ్మతుల కోసం స్తంభం ఎక్కుతున్న లైన్‌మెన్

ప్రజలకు వెలుగులు పంచే క్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పలపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. వేములనర్వ గ్రామ పరిధిలోని చౌదరిగూడ ఫీడర్‌కు కరెంట్ సరఫరా చేసే స్తంభంపై ఆదివారం రాత్రి అంతరాయం ఏర్పడింది. ఏఈ ఈశ్వర్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాజు, అసిస్టెంట్ లైన్‌మెన్ శ్రీకాంత్ సోమవారం ఉదయం విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఇప్పలపల్లి చెరువులోని స్తంభంపై ఇన్సులేటర్ కాలిపోయినట్లు అసిస్టెంట్ లైన్‌మెన్ శ్రీకాంత్ గుర్తించాడు. స్థానిక రైతు శ్రీనివాస్‌రెడ్డి సాయంతో నీట మునిగిన స్తంభంపైకి ఎక్కి ఇన్సులేటర్ బిగించి సమస్యను పరిష్కరించారు. ఇది చూసిన స్థానిక ప్రజలు, రైతులు కరెంటోళ్లకు దండాలు అంటూ ధన్యవాదములు తెలియజేశారు.

– కేశంపేట

పంద్రాగస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు


మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- సమన్వయంతో సమస్యలు లేకుండా చూడాలి
- కలెక్టర్ సి.నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వీఐపీలు, అధికారులు, మీడియా ఇతరులకు సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్య అతిథి సందేశం రూపొందించేందుకు ఆయా శాఖలు సాధించిన ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపాలన్నారు. వేడుకలకు హాజరయ్యే అతిథికి గౌరవ వందనంతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దని విద్యుత్ అధికారులకు సూచించారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓకు చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కె.శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ సునీల్‌కుమార్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా అధికారులు, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కె.శ్రీనివాస్, డీఆర్ఓ సంగీత ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ప్రజావాణికి 61 ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దారులు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

తెలంగాణ మోడల్ స్కూల్‌గా కేంద్రీకృతం చేయండి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: పంచాయతీ పరిధిలోని పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్(బాలుర, బాలికల), ప్రాథమికోన్నత పాఠశాలలను తెలంగాణ మోడల్ స్కూల్‌గా కేంద్రీకృతం చేయాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సిహారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం నగరంలోని తెలంగాణ విద్యా కమిషన్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి జీనత్పర్ అజ్మీ సయ్యద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా పాఠశాలల్లో 700 మంది వరకు విద్యార్థులు, 45 మంది ఉపాధ్యాయులున్నారని వీరిని తెలంగాణ మోడల్ స్కూల్ విధానంలో ఏకీకృతం చేయాలని కోరారు.


జీనత్పర్ అజ్మీ సయ్యద్‌కు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

ఆర్టీసీకి గిరాఖీ

టీఎస్ ఆర్టీసీకి రాఖీ పౌర్ణమి బాగా కలిసొచ్చింది. ఊహించని విధంగా ప్రయాణికుల రద్దీ పెరిగి బస్సులు కిటకిటలాడాయి. మూడు రోజుల పాటు కొనసాగిన ప్రయాణికుల రద్దీతో ఖజానాకు కాసుల వర్షం కురిసింది.

మూడు రోజులు.. రూ.1.20 కోట్లు

షాద్‌నగర్ డిపో నుంచి స్పెషల్ సర్వీసులు

- పండుగవేళ కిటకిటలాడిన బస్టాండ్‌లు
- రికార్డు స్థాయిలో ఆదాయం

ఆదాయం ఇలా

తేదీ	ప్రయాణికులు	వచ్చిన ఆదాయం
8న	47,540	రూ.27.98 లక్షలు
9న	61,076	రూ.47.03 లక్షలు
10న	56,988	రూ.45.71 లక్షలు

షాద్‌నగర్: రాఖీ పండుగ సందర్భంగా షాద్‌నగర్ డిపో నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక బస్సు లను నడిపించారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు 1.65లక్షల మందికి పైగా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చారు. ఫలితంగా సంస్థకు మూడు రోజుల్లో రూ.1.20లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. హైదరాబాద్, మహబూబ్‌నగర్ రూట్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆ రూట్లలో అధికారులు స్పెషల్ సర్వీసులు పెంచి ఆదాయం గడించారు.

'మహాలక్ష్మి'ల ప్రయాణం

రాఖీ పండుగ అంటేనే అనుబంధాలకు ప్రతీక. ఈ పండుగ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి మహాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. 1.09లక్షల మందికి పైగా మహిళలు బస్సుల్లో ప్రయాణించారు. ఈనెల 8న 29,594 మంది 9న 42,072 మంది, 10న 38,262 మంది మహిళలు బస్సుల్లో ప్రయాణించారు. మహాలక్ష్మి పథకం ద్వారా రూ.77.24 లక్షల ఆదాయం వచ్చింది. ఇందులో పండుగ ఒక్క రోజే రూ.31లక్షలకు పైగా ఆదాయం చేరింది.

రద్దీకి అనుగుణంగా బస్సులు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడిపించారు. అదనపు ట్రిప్పులతో పాటు, హైదరాబాద్ ఇతర డిపోల నుంచి బస్సులను తెప్పించి నడిపించారు. డ్రైవర్లు, కండక్టర్లు అధికారులు సిబ్బంది పండుగ రోజు సెలవులను పక్కన పెట్టి విధి నిర్వహణలో భాగస్వామ్యమై సంస్థకు ఆదాయం సమకూర్చడంలో కీలక పాత్ర పోషించారు.11 ఎస్‌డిఎస్ఆర్ 803 బీ) ఉష, ఆర్‌టీసీ డిపో మేనేజర్, షాద్‌నగర్

రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపాం



రాఖీ పండుగ సందర్భంగా రద్దీని దృష్టిలో పెట్టుకొని బస్సులు నడిపించాం. ఫలితంగా మూడు రోజుల్లో 1.65 లక్షల మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాం. ఫలితంగా సంస్థకు రూ.1.20 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది.

– ఉష, ఆర్టీసీ డిపో మేనేజర్, షాద్‌నగర్


షాద్‌నగర్ డిపోలో కిక్కిరిసిన ప్రయాణికులు

లక్ష్మీకటాక్షం


మహేశ్వరం ఆర్టీసీ డిపో...

మహేశ్వరం: రక్షా బంధన్ రోజున మహేశ్వరం ఆర్టీసీ డిపోకు లక్ష్మీకటాక్షం లభించింది. రాఖీ పండుగ నేపథ్యంలో మహేశ్వరం డిపో పరిధిలో 26,580 కిలో మీటర్ల దూరం సర్వీసులు నడిచాయి. పండుగ ఒక్క రోజే డిపోకు రూ.23.24లక్షల ఆదాయం సమకూరింది. మహాలక్ష్మీ పథకం కింద 48 వేల మంది మహిళలు ప్రయాణించగా రూ.13.96లక్షల ఆదాయం వచ్చింది.

సమష్టి కృషి



రాఖీ పండుగ నేపథ్యంలో రూ.23.24లక్షల ఆదాయం సమకూరింది. డిపోలో పని చేసే డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది సమష్టి కృషితో ఆదాయం గడించాం.

– లక్ష్మీ సుధ, ఆర్టీసీ డిపో మేనేజర్, మహేశ్వరం

ఆర్టీసీ బస్సులో డీజిల్ చోరీ

కేశంపేట: నైట్ హాల్ట్ ఆర్టీసీ బస్సు నుంచి గుర్తు తెలియని దుండగులు డీజిల్ దొంగిలించారు. ఈ ఘటన మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. కొండారెడ్డిపల్లి గ్రామానికి ఫలక్‌నుమా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అఫ్జల్‌గంజ్ నుంచి కొండారెడ్డిపల్లి గ్రామానికి రాకపోకలను సాగిస్తుంది. రాత్రి కొండారెడ్డిపల్లి గ్రామంలోనే బస్సు నిలుపుతారు. ఆదివారం రాత్రి బస్సును నిలిపి, డ్రైవర్, కండక్టర్లు నిద్రించారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని దొంగ ఆర్టీసీ బస్సు నుంచి సుమారుగా 90 లీటర్ల డీజిల్‌ను దొంగిలించాడు. డ్యూటీ డ్రైవర్ రిపోర్టింగ్ సమయంలో చోరీ జరిగినట్లు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామానికి చెందిన పల్లె బాలీశ్వర్ రూ.5 వేలు, కానం ప్రేమ్‌కుమార్‌గౌడ్ రూ.3 వేలు వెచ్చించి డీజిల్ పోయించారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

గంట్లవెల్లి ఎంపీపీఎస్‌లో ఫ్యాన్లు ధ్వంసం

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలో సీలింగ్ ఫ్యాన్లను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని గంట్లవెల్లి ప్రాథమికోన్నత పాఠశాల(ఎంపీపీఎస్)లో సోమవారం వెలుగులోకి వచ్చింది. పాఠశాల హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి దాతల సహకారంతో విద్యార్థుల సౌకర్యార్థం తరగతి గదుల్లో, వరండాలో సీలింగ్ ఫ్యాన్లను ఏర్పాటు చేయించారు. వరుస సెలవులు ఉండడంతో వరండాలోని ఫ్యాన్లను దుండగులు ధ్వంసం చేశారు. సోమవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు పాఠశాల మైదానంలో ఆడుకునేందుకు వస్తుంటారని.. వారిలో ఎవరైనా ఈ పని చేసి ఉంటారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించి తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్ఎం శ్రీధర్‌రెడ్డి తెలిపారు.


దుండగులు ధ్వంసం చేసిన సీలింగ్ ఫ్యాన్లు

ఏఈఈలకు పదోన్నతులు

డీఈఈలుగా ప్రమోషన్, బదిలీ

కేశంపేట: ఇరిగేషన్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న ఐదుగురికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతులు లభించాయి. షాద్‌నగర్ పరిధి ఫరూఖ్‌నగర్ మండలంలో ఏఈఈగా పనిచేస్తున్న సుజాతను నారాయణపేటకు, కొందుర్గు మండలంలో పనిచేస్తున్న క్రాంతిని వనపర్తి జిల్లా పెబ్బేరు ఎస్ఈ కార్యాలయానికి, కేశంపేటలో విధులు నిర్వర్తిస్తున్న గీతను వనపర్తికి, రేఖను జహీరాబాద్, మాధవిని జగిత్యాల జిల్లాకు బదిలీ చేస్తూ, ప్రమోషన్లు కల్పించారు.


గీత


క్రాంతి

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

కొందుర్గు: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రాయికంటి బలరాం పాడిగేదెలను పోషిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. పాడిగేదెను మేపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కుగురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని.. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.


గేదె కళేబరం వద్ద రైతు బలరాం

గుంతల రోడ్డుపై నిరసన


బురద నీటిలో వరి నాట్లేస్తున్న గ్రామస్తులు

యాచారం: వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేయాలని తక్కళ్లపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తక్కళ్లపల్లి- తక్కళ్లపల్లి గేట్ మధ్యన ధ్వంసమైన రహదారిపై వరి నాటు వేసి నిరసన వ్యక్తంచేశారు. అధ్వానంగా మారిన రోడ్డుతో ఎప్పుడు ఏప్రమాదం ముంచుకొస్తుందో తెలియడం లేదన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ, పంచాయతీరాజ్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఆందోళన చేసిన వారిలో బీజేపీ నాయకులు పగడాల శ్రీశైలం, కుమార్ యాదవ్, డాక్టర్ సురేందర్, గడల సురేష్, బాబురావు, నర్సింహ, అంజయ్య, రాములు ఉన్నారు.

విద్యుదాఘాతానికి ఉద్యోగి మృతి

మలక్‌పేట: విద్యుదాఘాతంతో ఓ ఉద్యోగి మృతి చెందిన సంఘటన సోమవారం మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ తెలిపిన మేరకు.. మూసారంబాగ్ డివిజన్ సలీంనగర్‌లో ఎఫ్‌టీసీ ఫీల్డ్ వర్కర్ ఆర్టిసన్ ఉద్యోగి అంజద్(42) విధినిర్వహణలో ఉండగా కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండుగ రోజున రూ.13లక్షలు అదనం



ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో

ఇబ్రహీంపట్నం: రాఖీ పండుగ రోజున ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోనకు రూ.41లక్షల ఆదాయం సమకూరింది. మహాలక్ష్మి పథకం నుంచి రూ.27లక్షలు కాగా నగదు రూపేనా రూ.14లక్షల ఆదాయం వచ్చింది. డిపోలో 86 ఆర్టీసీ, 61 అద్దె బస్సులుండగా పండుగ రోజున అదనంగా మరో 11 సర్వీసులు అదనంగా పెంచారు. పండుగ రోజున 40 వేల మంది ప్రయాణికుల్లో 25 వేల మంది మహిళలు ఉన్నారు. మాల్ నుంచి మహాత్మాగాంధీ(ఎంజీబీఎస్), సికింద్రాబాద్ రూట్లలో ఎక్కువ ఆదాయం సమకూరింది. వర్షం, ట్రాఫిక్ జామ్ కారణంగా సకాలంలో బస్సులు రాకపోకలు సాగించక పెట్టుకున్న టార్గెట్‌కన్నా రూ.70 వేల ఆదాయం తక్కువగా వచ్చింది. ఈ డిపోకు నిత్యం సుమారు రూ.28 లక్షల ఆదాయం వస్తుంది. రాఖీ పర్వదినాన రూ.13 లక్షల ఆదాయం అదనంగా సమకూరింది.

ఆదాయం పెరిగింది



రాఖీ పర్వదినాన ఆర్టీసీ ఆదాయం పెరిగింది. మహిళ ప్రయాణికులు సుమారు 25 వేల మంది ఉచితంగా ప్రయాణించారు. డిపోకు రూ.41 లక్షల ఆదాయం సమకూరింది. ట్రాఫిక్ జామ్ కారణంగా అనుకున్న టార్గెట్ సాధించలేకపోయాం.

– వెంకట నర్సప్ప, డిపో మేనేజర్, ఇబ్రహీంపట్నం

భారీ వర్షం.. అతలాకుతలం

కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం ఆగమాగం అవుతోంది. సోమవారం సైతం విస్తారంగా వాన పడడంతో వాగులు, వంకలు, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఇదే తీరు కొనసాగింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడి సరఫరాలో అంతరాయం కలిగింది. ఇళ్లల్లోకి నీరు చేరడంతో కొన్ని ధ్వంసమయ్యాయి. పంట పొలాల్లోకి వరదనీరు చేరడంతో నీట మునిగాయి. చెరువులు అలుగు పారాయి. రహదారులపై రాకపోకలకు తీవ్ర అవస్థలు పడ్డారు.

– సాక్షి, నెట్‌వర్క్


చేవెళ్ల: ఆలయ కమాన్ ఎదుట చేరిన వరద


చేవెళ్ల: ధర్మసాగర్ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు


చేవెళ్ల: ఆలూరులోని పెద్ద వాగు పొంగడంతో నిలిచిన రాకపోకలు


యాలాల: లక్ష్మీనారాయణపూర్-దేవనూరు రోడ్డు దుస్థితి


తాండూరు రూరల్: బెల్కటూర్ వద్ద డైవర్షన్ రోడ్డుపై పారుతున్న వాగు